క్లుప్తంగా

నియామకం



హరీష్

పూసపాటిరేగ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా సుందర హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన గురువారం తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పనిచేసి పార్టీ మరింత బలోపేతానికి పాటుపడతానన్నారు.

బాధ్యతల స్వీకరణ



చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేనేజర్ జయరాం

నెల్లిమర్ల: నగరపంచాయతీ మేనేజర్‌గా తుమ్మి జయరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన చైర్‌పర్సన్ బంగారు సరోజినిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై ఇరువురూ కాసేపు చర్చించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృష చేస్తానని ఆయన తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



బ్యాగులతో విద్యార్థులు, సంస్థ నిర్వాహకురాలు కాంచన

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్, కణపాక, కేఎల్‌పురం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కణపాక ప్రాంతానికి చెందిన అన్నదాత సుఖీభవ స్వచ్ఛంద సంస్థ వారు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఆ సంస్థ నిర్వాహకురాలు కాంచన ఆయా పాఠశాలలకు వెళ్లి, అక్కడి విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్‌బ్యాగులు గురువారం అందజేశారు. ఈ మేరకు పాఠశాల సిబ్బంది ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థుల భోజనం పరిశీలిస్తున్న జేడీ తహెర సుల్తాన్

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ, గొల్లపేట ఏపీ మోడల్ స్కూల్‌ను జేడీ తహెర సుల్తాన్ గురువారం సందర్శించారు. మధ్యాహ్నం అక్కడి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై దృష్టిసారించాలని, నాణ్యమైన విద్యనందివ్వడమే కాకుండా పౌష్టికాహార విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని సిబ్బందికి ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో కంది ధర్మకుమార్, ఏపీసీ ఎ.రామారావు, సీఎంవో వి.ఆదినారాయణ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

నెల్లిమర్ల: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు మెరుగైన ఆరోగ్యానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం. అన్నపూర్ణ, ఎంఈవో వి.జ్ఞానశంకర్, ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

విజయనగరం: యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని కొత్తపేట నీళ్లట్యాంకు వద్ద యోగాసనాల సాధన గురువారం చేశారు. అనంతరం యోగా విశిష్టత తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు.

విమాన ప్రమాదం బాధాకరం

విజయనగరం క్రైమ్: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటన చాలా బాధాకరమని నగరంలో నివాసముంటున్న లండన్ వాసి ఇందుమతి అన్నారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తుండగా గురువారం మధ్యాహ్నం విమానం కూలడంతో నగరంలో ఉంటున్న ఆమె జరిగిన ఘటనపై స్పందించారు. వైద్య వృత్తిలో స్థిరపడిన తాము 2005 నుంచి లండన్‌లో ఉంటున్నామని, ఏడాదికి ఓసారి విజయనగరం వస్తామని తెలిపారు. మునుపెన్నడూ ఇలాంటి విషాదకర ఘటన చోటుచేసుకోలేదని, బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్నివ్వాలని కోరారు.

సాగు మొదలు.. సాయం కరువు!

- ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం
- రైతుకు భారంగా మారిన వ్యవసాయం
- పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు
- అంతంతమాత్రంగా సేద్యం
- సాయం కోసం అన్నదాత ఎదురుచూపు

నియోజకవర్గ రైతులకు వైఎస్సార్ సీపీ హయాంలో అందిన సాయం

సంవత్సరం	రైతులు	సాయం
2019-20	25,394	రూ.34.28 కోట్లు
2020-21	30,638	రూ.41.36 కోట్లు
2021-22	30,426	రూ.41.08 కోట్లు
2022-23	30,954	రూ.42.20 కోట్లు
2023-24	32,533	రూ.43.83 కోట్లు



చౌడువాడలో కొబ్బరి తోటలో సాగుకు సిద్ధం చేసిన నేల

పూసపాటిరేగ: ఖరీఫ్ సీజన్ సాగు పనులు ఆరంభమయ్యాయి. విపరీతంగా పెరిగిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు..రైతుకు సాగు కష్టాలు తెచ్చిపెట్టాయి. అప్పులు చేసి వ్యవసాయం చేద్దామన్నా అప్పులు కూడా పుట్టని పరిస్థితి. మరోవైపు కూటమి ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం కూడా అమలులోకి రాలేదు. ఇదిగో సాగు సాయం డబ్బులు వేస్తామని రోజుకో మాట కూటమి నేతలు చెబుతుంటే.. అది విని కొంతమంది ఇప్పటివరకు సాగు పనులు చేపట్టని దుస్థితి. ఈ నేపథ్యంలో సర్కారు సాయం కోసం అన్నదాతకు ఎదురుచూపులు తప్పడం లేదు.

అప్పుడొక మాట.. ఇప్పుడొక మాట..

ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం పేరిట ఏటా రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాటమార్చారు. ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం పేరిట ఇచ్చే రూ.6 వేలకు కలిపి రూ.20 వేలు ఇస్తామని కూటమి నేతలు ఇప్పుడు మాటమార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లూ ఏటా చెప్పిన తేదీకే సాగు సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. సరిగ్గా ఖరీఫ్, రబీ సీజన్‌ల సమయానికి డబ్బులు వేయడంతో రైతులు దర్జాగా సాగు చేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో సాగు ఎలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

ఏవీ అందుబాటులో లేవు..

గత ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేవారు. సాగు సీజన్‌లకు ముందుగానే వాటిని కేంద్రాలకు తెచ్చి తర్వాత అవసరమైన రైతులకు అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితికి భిన్నంగా రైతు సేవా కేంద్రాల్లో ఉంది. ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు కోసం ఇండెంట్ పెట్టారే తప్ప ఇంకేమీ చేయలేదు. ప్రస్తుతం సాగు పనులు జరుగుతున్న వేళ ప్రభుత్వం నుంచి ఏ విధమైన సాయం అందకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. నియోజకవర్గంలోని 28 వేల మంది రైతులు ప్రభుత్వం అందించే సాయం కోసం వేచి చూస్తున్నారు.

పనులప్పుడు ఇస్తేనే మేలు..

ఖరీఫ్ సాగు పనులు అవుతున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం ఇప్పుడిస్తేనే మేలు. వ్యవసాయ పనులకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన తర్వాత వడ్డీల పెరిగాక డబ్బులిస్తే ఏం లాభం. సేద్యం మొదలైనప్పుడు ఇస్తేనే కదా అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. రైతు కష్టాలు గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలి.

–జి.సురేష్‌రెడ్డి, రైతు, కుమిలి గ్రామం

అన్నదాత సుఖీభవ ఎప్పుడు?

ఎన్నికల హామీల్లో ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడిస్తారు? ఖరీఫ్ పనుల ప్రారంభంలోనే ఇస్తే పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడతాయి. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతలకు ఉపయోగపడే పని చేయలేదు. ఇప్పటికైనా సాగు సాయం విడుదల చేసి ఆదుకోవాలి.

–వి.అక్కునాయుడు, రైతు, తాళ్లపేట

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న రెల్లివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది

పూసపాటిరేగ: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని మండలంలోని రెల్లివలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శంకరరావు తెలిపారు. అదే గ్రామంలో ఆయన సిబ్బందితో కలిసి బడిబాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో ఆ పాఠశాల విద్యార్థులు కనబరిచిన ఫలితాల బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని, కార్పొరేట్ ధీటుగా విద్యనందిస్తామని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు వివరించారు.

ప్రజాసమస్యలపై అసిస్టెంట్ కమిషనర్ ఆరా



వార్డు పర్యటనలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: నగరంలోని 38వ డివిజన్ బొబ్బాదిపేటలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, మురుగుకాలువలు, వీధిదీపాలు వంటి సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. తాగునీటి పంపిణీ సమయానికి జరుగుతుందా లేదా అని అడిగారు. ఈ క్రమంలో పలు సమస్యలు ఆయన దృష్టికి రాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కమిషనర్ పల్లి నల్లనయ్య సూచనలతో ప్రతివారం ఒక్కో డివిజన్‌లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఇప్పటికే గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మలిచర్ల, సుంకరిపేట, చెల్లూరు, బడుకొండపేట, రామజోగిపేట గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ సబ్‌స్టేషన్ పరిధిలోని కష్టాపురం, రఘుమండ, గుండాలపేట, మోదవలస దగ్గరున్న రాజపులోవ సబ్‌స్టేషన్ పరిధిలోని మోపాడ, జగన్నాథపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కూలిన చెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: మండలంలోని పినవేమలి ఒడ్డు పోలమ్మ ఆలయం వద్ద విద్యుత్ వైర్లపై పడిన చెట్లను గురువారం తొలగించారు. ఇటీవల వైర్లపై చెట్లు పడిపోవడంతో 'విద్యుత్ వైర్లపై కూలిన చెట్లు' శీర్షికన ఈ నెల 12వ తేదీన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. హుటాహుటిన కరెంట్ తీగలపై ఉన్న చెట్లు తీసి, కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

బడిగంటలు మోగిన వేళ..









బడిగంట మోగింది..పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.. గురువారం నుంచి ఆరంభమైన కొత్త విద్యా సంవత్సరంలో చదువుకునేందుకు సరికొత్త ఉత్సాహంతో విద్యార్థులు స్కూళ్లుకు పయనమయ్యారు. వేసవి సెలవుల తర్వాత చాలా రోజులకు తమ స్నేహితులు, ఉపాధ్యాయులను కలుసుకుంటున్నామన్న ఆనందం అందరిలో కనిపించింది. తొలిరోజు తరగతులు సరదా సరదాగా కొనసాగాయి. స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థుల చిత్రాలు కొన్ని ఈ చిత్రంలో చూడొచ్చు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రేషన్ డిపోకు తాళాలు



నెల్లిమర్ల నగరపంచాయతీ, 15వ వార్డులో ఉన్న రేషన్ డిపోకు తాళాలు వేసి ఉండడంపై కౌన్సిలర్ జానా సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ దుకాణాన్ని ఆమె గురువారం సందర్శించగా, తాళం వేసి ఉండడాన్ని గమనించి అధికారులకు తెలియజేశారు. అందరికీ రేషన్ అందేలా 15 రోజుల పాటు రేషన్ షాపు తెరిచి ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినా ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలన్నారు. నెల్లిమర్ల

సిబ్బందిని తొలగించడం దుర్మార్గం



సంచార పశువైద్య సేవల వాహనాల సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా రెవెన్యూ అధికారిని విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2022లో అందుబాటులోకి వచ్చిన సంచార పశువైద్య సేవల వాహనాల సిబ్బందిని ఇప్పుడు తొలగించడం అన్యాయమన్నారు. అధికారంలోకి వస్తే లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిస్తామని చెప్పి, వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సంచార పశువైద్య సేవల సిబ్బందిని తీసేస్తుండడం దుర్మార్గమన్నారు. తక్షణమే తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

–విజయనగరం ఫోర్ట్

ఆక్రమణల తొలగింపు



విజయనగరంలోని తోటపాలెం మౌర్యా గార్డెన్ వద్ద ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. అక్కడి కాలువలపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్న విషయం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్యకు తెలిసింది. ఈ మేరకు ఆయన ఆక్రమణలు తొలగించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన సిబ్బంది కాలువపై తాత్కాలికంగా, శాశ్వతంగా చేసిన నిర్మాణాలు తొలగించారు. కాలువలను ఆక్రమిస్తుండడం వల్ల మురుగునీరు కాలువ ద్వారా సక్రమంగా వెళ్లడం లేదని కమిషనర్ తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా ఆక్రమణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

–విజయనగరం

ఆస్తి పన్ను పరిధిలోకి అన్ని భవనాలు..



భవనాల కొలతలు వేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని అన్ని భవన నిర్మాణాలను ఆస్తిపన్ను పరిధిలోకి తీసుకువస్తున్నట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, పలు భవనాల కొలతలు సిబ్బంది గురువారం తీశారు. ఆయన మాట్లాడుతూ ఇదివరకు పన్ను పరిధిలో ఉన్న భవనాలకు మార్పులు, చేర్పులు చేసిన నిర్మాణాలు కూడా పన్ను పరిధిలోకి రావాల్సి ఉందన్నారు. నగరంలోని 60 సచివాలయాల పరిధిలో పరిపాలన కార్యదర్శులకు ఈ విషయమై సర్వే చేపట్టి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్పొరేషన్ ఆదాయం పెంచే మార్గాలకు ఇది ఉపకరిస్తుందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

బొండపల్లి: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, నాగేంద్ర, సంధ్యారాణి అన్నారు. మండలంలోని నెలివాడలో చేపడుతున్న ఉపాధి వేతనదారులను గురువారం కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల్లిమర్ల, బొండపల్లి, విజయనగరం రూరల్ పరిధిలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహాయంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అన్నీ మోసాలే..

చీపురుపల్లి: కూటమి పాలనలో అన్నీ మోసాలేనని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాది కాలంగా నిరుద్యోగ యువత, విద్యార్థులకు చంద్రబాబు సర్కారు ఎంతో మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అలాగే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి గోవింద, కొమ్ము చిరంజీవి, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, కోసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, మహేష్, రాము, కరణపు ఆది, బలగ రమేష్, పనస వెంకట్, బలరాం, డీజే, తదిదతరులు పాల్గొన్నారు.

ఒక్క హామీ నెరవేర్చలేదు..

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలదేని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని అర్దన్నపాలెం సమీపంలో గల క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా కనీసం పది శాతం హామీలు నెరవేర్చలేదన్నారున. హామీల గురించి నిలదీస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ఇబ్బందులు పాల్జేస్తున్నారని ఆరోపించారు. కూటమి పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99.96 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి సుమారు లక్షా 20 వేల మంది ఉద్యోగులను నియమించారని చెప్పారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా ఉద్యోగాలు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కూటమి పాలనలో అరెస్టులు తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఎన్నో భవనాలు నిర్మించామని... అందులో కొన్ని అసంపూర్తిగా ఉంటే వాటిని పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వలంటీర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రి శ్రీను, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లు అవినాష్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస మండలాల అధ్యక్షులు వాకాడ సతీష్, తూర్పాటి అప్పలరాజు, ఒబ్బిన శ్రీనివాస్, ఐతంశెట్టి అనిల్, తదితరులు పాల్గొన్నారు.